## కంగనపై రైతు సంఘాల భగ్గు



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కంగన రనౌత్‌పై రైతు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 2021-22లో సాగు చట్టాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన రైతులను కించపరచినందుకు ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. సంయుక్త కిసాన్ మంచ్ కన్వీనర్ హరీశ్ చౌహాన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ, నాడు జరిగిన రైతు ఉద్యమంలో పాల్గొన్న పంజాబ్ మహిళా రైతును కంగన తప్పుగా చిత్రీకరించి, రైతులను కించపరిచారని చెప్పారు. సీఏఏకు వ్యతిరేకంగా షాహీన్‌బాగ్‌లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న బిల్కిస్ బానో (80)గా ఆ పంజాబ్ రైతును పేర్కొన్నారని చెప్పారు. వాస్తవాలను కొందరు యూజర్లు బయటపెట్టిన తర్వాత కంగన తన ట్వీట్‌ను డిలీట్ చేశారని తెలిపారు.




## సీబీఐని కేంద్రం నియంత్రించదు

**సుప్రీంలో కేంద్రం వివరణ**


న్యూఢిల్లీ: సీబీఐని భారత ప్రభుత్వం నియంత్రించదని సుప్రీం కోర్టుకు కేంద్రం స్పష్టం చేసింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన కేసు విచారణలో భాగంగా గురువారం ఈ వివరణ ఇచ్చింది. తమ రాష్ట్రంలో సీబీఐ దర్యాప్తు చేయకుండా సాధారణ సమ్మతిని(జనరల్ కన్సెంట్) ఉపసంహరించుకున్నా .. సీబీఐ ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేస్తున్నదని, దర్యాప్తు చేపడుతున్నదని పేర్కొంటూ బెంగాల్ సర్కారు ఆర్టికల్ 131 కింద కేంద్రంపై కేసు పెట్టింది. దీనిపై కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. కేంద్ర ప్రభుత్వం కేసులు నమోదు చేయదని, సీబీఐ కేసులు నమోదు చేస్తుందని తెలిపారు. సీబీఐ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండదని స్పష్టం చేశారు. ఆర్టికల్ 131ను దుర్వినియోగం చేయకుండా చూడాలని కోర్టుకు విన్నవించారు.

### సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో మహిళా కోటా అమలు

న్యూఢిల్లీ, మే 2: సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో మహిళా కోటా అమలుపై గురువారం సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఎస్సీబీఏ)లో మూడింట ఒక వంతు మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ఆదేశించింది. ఇకపై ఎస్సీబీఏలో ముగ్గురు ఎగ్జిక్యూటివ్ సభ్యులు, ఇద్దరు సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, కోశాధికారి.. అందరూ మహిళలే ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# బీజేపీకి ప్రజ్వల్ పోటు!

- కర్ణాటకలో కమలం పార్టీ ఆశలపై నీళ్లు
- లోక్‌సభ ఎన్నికల్లో సెక్స్ స్కాండల్ ప్రభావం
- వీడియోల గురించి ముందే తెలిసినా జేడీఎస్‌తో పొత్తు పెట్టుకున్న బీజేపీ!
- మహిళా ఓటర్లు దూరమయ్యే చాన్స్
- మే 7న తక్కిన 14 సీట్లకు ఎన్నికలు



బెంగళూరు, మే 2: దక్షిణాదిన 50 సీట్లు సాధించాలని బీజేపీ పెట్టుకున్న లక్ష్యానికి ప్రజ్వల్ రేవణ్ణ రూపంలో భారీ గండి పడింది. కర్ణాటకపై కమలం పార్టీ పెట్టుకున్న ఆశలన్నీ ఒకే దెబ్బకు ఆవిరయ్యాయి. జేడీఎస్‌తో పొత్తు పెట్టుకొని లాభపడాలని అనుకున్న ప్రయత్నాలు పూర్తిగా బెడిసికొట్టాయి. ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ వ్యవహారం బీజేపీకి భారీగా నష్టం చేసే అవకాశం ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మే 7న ఎన్నికలు జరగనున్న కర్ణాటకలోని 14 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ విజయావకాశాలను ఇది దెబ్బతీయవచ్చని, ముఖ్యంగా మహిళా ఓటర్లను బీజేపీకి దూరం చేయవచ్చని భావిస్తున్నారు. ఇదే జరిగితే కర్ణాటకలో బీజేపీ ఈసారి చేదు ఫలితాలను చూడబోతున్నది. గత ఎన్నికల్లో 28 స్థానాల్లో 25 స్థానాలు దక్కించుకొని దాదాపుగా క్లీన్‌స్వీప్ చేసిన కమలం పార్టీకి ఈసారి సీట్ల సంఖ్యలో భారీగా కోత పడే అవకాశం ఉంది.

**లాభమెంతో కానీ నష్టమైతే ఎక్కువే**

కర్ణాటకలోని మొత్తం 28 సీట్లలో దక్షిణ ప్రాంతంలోని 14 స్థానాలకు రెండో విడతలో పోలింగ్ ముగిసింది. దక్షిణ కర్ణాటకలో ఒక్కలిగ సామాజికవర్గం ప్రభావం ఎక్కువ. మొత్తం కర్ణాటకలో వీరి జనాభా దాదాపు 12 శాతం ఉంటుంది. ఈ సామాజికవర్గంలో దేవెగౌడ కుటుంబానికి మంచి పట్టుంది. ఈ ఎన్నికల్లో కూడా ఒక్కలిగ సామాజికవర్గాన్ని ఆకట్టుకోవడం, దక్షిణ కర్ణాటకలో లాభపడాలనే ప్రయత్నంలో భాగంగానే జేడీఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకొని 3 సీట్లు కేటాయించింది. ఈ 3 సీట్లతో పాటు దక్షిణ కర్ణాటకలోని మొత్తం 14 సీట్లకు ఏప్రిల్ 26న పోలింగ్ పూర్తయ్యింది. ఇక్కడ జేడీఎస్‌తో పొత్తు వల్ల బీజేపీకి ఏమేరకు లాభం జరిగిందో కానీ ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతం వల్ల ఎన్నికలు జరగాల్సిన మిగతా 14 నియోజకవర్గాల్లో మాత్రం దారుణంగా నష్టం జరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ప్రజ్వల్ వ్యవహారంపై బీజేపీకి ముందే సమాచారం ఉన్నప్పటికీ జేడీఎస్‌తో పొత్తు పెట్టుకుందని, ప్రజ్వల్‌కు టికెట్ ఇచ్చిందని జరుగుతున్న ప్రచారం బీజేపీకి ఇబ్బందికరంగా మారింది.

**పట్టున్న స్థానాల్లో సీన్ రివర్స్**

మే 7న మూడో విడతలో కర్ణాటకలోని చిక్కోడి, బెలగావి, బాగల్‌కోట్, బీజాపూర్, గుల్బర్గ, రాయచూర్, బీదర్, కొప్పల్, బళ్లారి, హవేరి, ధార్వాడ్, ఉత్తర కన్నడ, దవనగెరె, శిమొగ్గ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ 14 స్థానాలనూ గత ఎన్నికల్లో బీజేపీ కైవసం చేసుకుంది. లింగాయత్‌ల ప్రభావం ఎక్కువగా ఉండే ఈ స్థానాలపై ఈసారి కూడా బీజేపీకి చాలా ఆశలు ఉండేవి. అయితే ప్రజ్వల్ వ్యవహారంతో ఈ ప్రాంతంలో బీజేపీకి పడే ఓట్లకు భారీగా గండి పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### జేడీఎస్‌లో సంక్షోభం

ప్రజ్వల్ వ్యవహారం కేవలం లోక్‌సభ ఎన్నికల వరకే పరిమితం కాదని, ఆ తర్వాత కూడా కర్ణాటకలో బీజేపీ - జేడీఎస్ రాజకీయ ఆకాంక్షలకు గండి కొట్టిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 136 సీట్లు వచ్చాయి. మ్యాజిక్ ఫిగర్ కంటే ఆ పార్టీకి 23 సీట్లు ఎక్కువే ఉన్నాయి. అయినప్పటికీ అంతర్గత కలహాల వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ నేతలు పదేపదే చెబుతూ వస్తున్నారు. ఇప్పుడు ఒక్కసారిగా సీన్ మారింది. ప్రజ్వల్ వ్యవహారం బీజేపీ, మిత్రపక్షమైన జేడీఎస్‌లో పెను సంక్షోభానికి దారి తీస్తున్నది. ఇది కాంగ్రెస్‌కు కలిసి వస్తుందని విశ్లేషకులు అంటున్నారు.

# సర్వేల ముసుగులో లబ్ధిదారుల నమోదు ఆపాలి

**అన్ని పార్టీలకు ఈసీ ఆదేశం**

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రతిపాదిత పథకాల కోసం సర్వేల ముసుగులో ఓటర్ల వివరాలను సేకరిస్తుండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) గురువారం తెలిపింది. ఇటువంటి కార్యకలాపాలు ఎన్నికల చట్టాల ప్రకారం అవినీతిగా పరిగణింపబడతాయని చెప్పింది. ఎన్నికల తర్వాత లబ్ధి చేకూర్చే పథకాల కోసం వ్యక్తుల పేర్లను నమోదు చేయడానికి పక్షపాతంతో చేసే పనులకు, చట్టబద్ధమైన సర్వేలకు మధ్యనున్న గీతను మసకబార్చే కార్యకలాపాలకు వీరు పాల్పడుతున్నట్లు గమనించామని తెలిపింది. ఎన్నికల తర్వాత లబ్ధి చేకూర్చే పథకాల కోసం వ్యక్తుల పేర్లను మొబైల్ యాప్, సర్వే, లేదా, ప్రకటనల ద్వారా నమోదు చేయడాన్ని తక్షణమే మానుకోవాలని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు చెప్పింది. ఈ విధంగా పేర్లను నమోదు చేయడం వల్ల ఓటరుకు, ఎన్నికల తర్వాత రాబోతున్నదని ప్రతిపాదించిన లబ్ధికి మధ్య లావాదేవీ సంబంధం ఏర్పడుతుందని, ఓటు వేసే పద్ధతిని ప్రభావితం చేసి ఓ విధంగా 'నీకు ఇది - నాకు అది' అనే ఏర్పాటును సృష్టించవచ్చునని, ఇది ప్రలోభపెట్టడమవుతుందని వివరించింది. అయితే, సాధారణ ఎన్నికల వాగ్దానాలు అనుమతించదగినవేనని స్పష్టం చేసింది.

**వాటిపై చర్యలు తీసుకోండి**

ఓటర్ల వివరాలను సర్వేల ముసుగులో సేకరించేందుకు ప్రచురించే, ప్రచారం చేసే ప్రకటనలపై చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఫోన్ నంబర్ ఇచ్చి మిస్స్‌డ్ కాల్ ఇవ్వాలని, లేదా, ఫోన్ చేయాలని కోరుతూ ఇచ్చే ప్రకటనలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సాంఘిక-ఆర్థిక సర్వే పేరుతో ఫారాలను పంచిపెట్టి, దానిలో ఓటరు పేరు, రేషన్ కార్డు నంబరు, చిరునామా, ఫోన్ నంబరు, బూత్ నంబరు, బ్యాంక్ అకౌంట్ నంబరు, నియోజకవర్గం పేరు వంటి వివరాలను రాయాలని కోరినా చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఇటువంటి వివరాలను కోరే వెబ్ ప్లాట్‌ఫామ్స్, వెబ్ అప్లికేషన్లు, మొబైల్ యాప్‌లపై కూడా చర్యలకు ఆదేశించింది. కరపత్రాల రూపంలో గ్యారెంటీ కార్డులు ఇచ్చినా కొరడా ఝుళిపించాలని చెప్పింది.

2014లో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడిచమురు ధర 113 డాలర్లు.

**అప్పుడు దేశీయంగా లీటరు పెట్రోలు ధర రూ.71గా ఉంది.**

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడిచమురు ధర 85 డాలర్లు. **ఈ లెక్కన లీటరు పెట్రోలు ధర రూ.50కి అటూ ఇటూగా ఉండాలి. అయితే, ప్రస్తుతం లీటర్ పెట్రోల్ రూ. 107గా ఉన్నది.**

**అంటే లీటర్ పెట్రోల్ ధర ఉండాల్సిన దానికంటే రూ. 57 ఎక్కువగా ఉన్నది. దీనిని బట్టి కేంద్రంలోని బీజేపీ సర్కారు సామాన్యులపై ఎలా ధరాఘాతం మోపుతున్నదో అర్థంచేసుకోవచ్చు.**

# పెట్రో మంట

**పదేండ్ల బీజేపీ ప్రభుత్వహయాంలో ఇంధన ధరలు అంతకంతకూ పైపైకి**

- 50 శాతం మేర పెరిగిన పెట్రోల్ ధర
- లీటర్ డీజిల్‌పై 72 శాతం పెంపుదల
- వంటగ్యాస్ సిలిండర్ ధర 114% పైకి
- అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గినా.. ఇక్కడ తగ్గించని కేంద్ర సర్కారు
- పదేండ్లలో డీజిల్‌పై 343%, పెట్రోల్‌పై 109 శాతం ఎక్సైజ్ డ్యూటీ వడ్డింపు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): పదేండ్ల బీజేపీ ప్రభుత్వహయాంలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టినప్పుడు లీటర్ పెట్రోల్ ధర రూ. 71గా ఉంటే ప్రస్తుతం ఇది రూ. 107కు పెరిగింది. అప్పుడు రూ. 55గా ఉన్న లీటర్ డీజిల్ ధర ఇప్పుడు రూ. 95కు చేరింది. ఇండ్లల్లో వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధర 2014లో రూ. 399కే లభించగా.. ఇప్పుడు రూ. 855 ఖర్చుచేసినా దొరకని పరిస్థితి. వెరసి మోదీ ప్రభుత్వహయాంలో పెరిగిన ఇంధన ధరలతో సామాన్యులు కుదేలవుతున్నారు.

**తగ్గకపోగా.. బాదుడే బాదుడు**

అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినప్పుడు పెట్రోవాతపెట్టిన మోదీ సర్కారు.. ధరలు తగ్గినప్పుడు మాత్రం పెట్రోల్, డీజిల్ రేట్లను తగ్గించట్లేదు. దీంతో సామాన్యులకు అందాల్సిన ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. వివరంగా చెప్పాలంటే.. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గితే, దేశీయంగా పెట్రో ధరలు తగ్గాలి. కానీ కేంద్రం ఇంధన ధరలను పెంచుకుంటూ పోతున్నది. దీనికోసం ఎక్సైజ్ డ్యూటీ పేరిట అదనపు సుంకాలను విధిస్తున్నది. గడిచిన పదేండ్లలో కేంద్రం పెట్రోల్‌పై 109.91 శాతం ఎక్సైజ్ డ్యూటీని పెంచగా, డీజిల్‌పై ఏకంగా 343.82 శాతం పన్ను పెంచింది. ఈ మేరకు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) గణాంకాలు చెప్తున్నాయి. ఫలితంగా ఉక్రెయిన్ యుద్ధం సమయంలో చమురు ధరలు తగ్గినప్పటికీ, దేశీయంగా పెట్రో ధరలు మాత్రం తగ్గలేదు.



**పదేండ్లలో ఇంధన ధరల్లో మార్పు ఇలా**

| ఇంధనం | 2014 | 2024 | పెరుగుదల(%) |
|---|---|---|---|
| పెట్రోల్ | రూ. 71 | రూ. 107 | 50.7 |
| డీజిల్ | రూ. 55 | రూ. 95 | 72 |
| వంటగ్యాస్ | రూ. 399 | రూ. 855 | 114 |

**పదేండ్లలో ఎక్సైజ్ డ్యూటీలో మార్పు ఇలా**

| ఇంధనం | 2014 | 2024 | పెరుగుదల(%) |
|---|---|---|---|
| పెట్రోల్ | రూ. 9.48 | రూ. 19.9 | 109.9 |
| డీజిల్ | రూ. 3.56 | రూ. 15.8 | 343.8 |

# 400 మందిపై లైంగిక దాడి!

- ప్రజ్వల్ రేవణ్ణపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- రేపిస్ట్‌కు ఓట్లేయాలన్న ప్రధాని మోదీ దేశంలోని మహిళలందరికీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్



**గత నెల 14న ఓ ఎన్నికల ప్రచార సభలో దేవెగౌడ, ప్రజ్వల్‌తో ప్రధాని మోదీ**

శివమొగ్గ, మే 2: హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ 400 మహిళలపై లైంగిక దాడికి పాల్పడ్డారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కర్ణాటకలోని శివమొగ్గలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడారు. 'మాస్ రేపిస్ట్'కు ఓట్లేయమని అడిగినందుకు ప్రధాని మోదీ దేశ మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజ్వల్ 400 మందిపై అఘాయిత్యానికి పాల్పడి, వీడియోలు చిత్రీకరించాడని ఆరోపించారు. ఇది సెక్స్ కుంభకోణం కాదని, అతి పెద్ద అత్యాచార ఘటన అని పేర్కొన్నారు. ప్రజ్వల్ చేసిన అసభ్య పనుల గురించి మోదీకి ముందే తెలుసని ఆరోపించారు. 'ప్రతి భారత మహిళను ప్రధాని అవమానించారు. ప్రధాని, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ నాయకులందరూ దేశంలోని ప్రతి మహిళకు క్షమాపణలు చెప్పాలి. ప్రపంచంలో ఏ నాయకుడూ ఇలా లైంగిక దాడులు చేసిన వ్యక్తికి ఎన్నికల ప్రచారం చేయరు' అని రాహుల్ అన్నారు.

**ప్రజ్వల్‌పై లుక్ అవుట్ నోటీస్**

ప్రజ్వల్‌ను అరెస్ట్ చేసేందుకు లుక్ అవుట్ నోటీస్ జారీ చేసినట్టు కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర గురువారం తెలిపారు. ప్రజ్వల్ లైంగిక వేధింపుల గురించి మరో మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. మరోవైపు జర్మనీకి విమాన ప్రయాణం చేసేందుకు డిప్లొమాటిక్ పాస్‌పోర్ట్ కలిగినవారికి వీసా అవసరం లేదని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. ప్రజ్వల్ పాస్‌పోర్ట్ రద్దు గురించి తమకు ఇంకా ఏ కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు.

**అన్ని వివరాలు సిట్‌కు చెప్తా**

ప్రజ్వల్ సెక్స్ స్కాండల్ వీడియోలపై వివరాలన్నీ సిట్‌కు వెల్లడిస్తానని ప్రజ్వల్ మాజీ డ్రైవర్ కార్తీక్ గుర్తు తెలియని ప్రదేశం నుంచి పంపించిన వీడియో సందేశంలో పేర్కొన్నాడు. తాను బీజేపీ నేత దేవరాజె గౌడకు తప్ప ఇంకెవరికీ ఆ వీడియోలు ఇవ్వలేదని తెలిపాడు. మరోవైపు కార్తీక్ మలేషియాలో ఉన్నాడని.. అతడిని అక్కడికి ఎవరు పంపించారని జేడీ(ఎస్) కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి ప్రశ్నించారు. సెక్స్ స్కాండల్ వీడియోల విడుదల వెనుక రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఆయన సోదరుడు సురేశ్‌ల హస్తం ఉన్నదని ఆరోపించారు. దీన్ని శివకుమార్ ఖండించారు.

**ముందస్తు బెయిల్‌కు రేవణ్ణ దరఖాస్తు**

ప్రజ్వల్ లైంగిక వేధింపుల కేసులో సహ నిందితుడు, జేడీ(ఎస్) ఎమ్మెల్యే రేవణ్ణ గురువారం ముందస్తు బెయిల్ కోసం బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల కోర్టును ఆశ్రయించారు. రేవణ్ణ బెయిల్ అభ్యర్థనపై ఏమైనా అభ్యంతరాలుంటే మే 3 లోగా తెలపాలని కోర్టు సిట్‌ను ఆదేశించింది.

**ప్రజ్వల్‌ను కృష్ణుడితో పోల్చిన మంత్రి!**

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజ్వల్‌ను శ్రీ కృష్ణుడితో పోలుస్తూ కర్ణాటక అబ్కారీ మంత్రి రామప్ప వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'ఇలాంటి నీచమైన ఆలోచన దేశంలో ఎక్కడా చూడలేదు. ఆయన తాను గిన్నిస్ రికార్డు నెలకొల్పుతానని అనుకున్నారేమో. ప్రజ్వల్ కృష్ణుడి రికార్డును బ్రేక్ చేయాలనుకున్నారేమో' అని అన్నారు.

## బ్రిజ్ భూషణ్ కుమారుడికి బీజేపీ టికెట్

**రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్**



కరణ్ భూషణ్

న్యూఢిల్లీ, మే 2: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు ఈసారి టికెట్ దక్కలేదు. ఉత్తరప్రదేశ్‌లోని కైసర్‌గంజ్ నుంచి బ్రిజ్ భూషణ్ స్థానంలో ఈసారి ఆయన కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌ను బీజేపీ బరిలోకి దింపింది. ప్రస్తుతం కరణ్ భూషణ్ సింగ్ ఉత్తరప్రదేశ్ రెజ్లింగ్ ఫెడరేషన్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. 2009, 2014, 2019లో కైసర్‌గంజ్ నుంచి బ్రిజ్ భూషణ్ ఎంపీగా గెలిచారు. అంతకుముందు ఆయన గోండా నియోజకవర్గం నుంచి రెండుసార్లు, బల్‌రాంపూర్ నుంచి ఒకసారి ఎంపీగా పని చేశారు. 2011 నుంచి రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడిగా పని చేసిన బ్రిజ్ భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ రెజ్లర్లు గత ఏడాది ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. దీంతో బ్రిజ్ భూషణ్‌పై రెండు కేసులు నమోదయ్యాయి. మైనర్‌పై లైంగిక వేధింపులతో ఆరోపణలతో ఆయనపై పోక్సో చట్టం కింద కూడా కేసు నమోదయ్యింది. ఈ నేపథ్యంలో మళ్లీ బ్రిజ్ భూషణ్‌కు టికెట్ ఇస్తే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని బీజేపీ అధిష్ఠానం భావించింది. అయితే, ఈ ప్రాంతంలో బ్రిజ్ భూషణ్‌కు పట్టుండటంతో, ఎన్నికల్లో నష్టం జరగకుండా ఉండేందుకు ఆయన స్థానంలో కుమారుడు కరణ్ భూషణ్‌కు టికెట్ ఇచ్చింది. కైసర్‌గంజ్‌కు ఐదో దశలో మే 20న ఎన్నికలు జరగనున్నాయి.

### బీజేపీ తీరు సిగ్గుచేటు: విపక్షాలు

తీవ్రమైన లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్ కుమారుడు కరణ్ భూషణ్ సింగ్‌కు బీజేపీ టికెట్ కేటాయించడంపై ప్రతిపక్ష పార్టీలు మండిపడ్డాయి. ప్రజ్వల్ రేవణ్ణ సెక్స్ స్కాండల్ బీజేపీ దిగజారుడుతనాన్ని బహిర్గతం చేసిందని అనుకుంటుండగానే, బ్రిజ్ భూషణ్ కుమారుడికి టికెట్‌ను బహుమతిగా అందించడం ద్వారా ఇంకా లోతుల్లోకి పతనం అవుతామని బీజేపీ నిరూపించుకుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు. శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ.. బ్రిజ్ భూషణ్ టికెట్‌ను అతడి కుమారుడికి ఇవ్వడం ద్వారా మహిళలకు న్యాయం చేస్తున్నట్టు చెప్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ఇది సిగ్గుచేటు అని విమర్శించారు. బ్రిజ్ లైంగిక వేధింపులను ఖండించడానికి బీజేపీ సిద్ధంగా లేదని అర్థమైందని టీఎంసీ ఎంపీ సాగరిక ఘోస్ పేర్కొన్నారు.

## బెంగాల్ గవర్నర్‌పై లైంగిక ఆరోపణలు

**ఫిర్యాదు చేసిన రాజ్‌భవన్ ఉద్యోగిని**



ఆనంద బోస్

కోల్‌కతా: ప్రధాని మోదీ బెంగాల్ పర్యటనకు ముందు బీజేపీకి షాక్ తగిలింది. బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న తాత్కాలిక మహిళా ఉద్యోగి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆమె ఆయనపై హరే స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఇప్పటికే బెంగాల్ ప్రభుత్వం, గవర్నర్ మధ్య సంబంధాలు దెబ్బతిని ఉండటం, దానికి తోడు లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండు రోజుల పర్యటనకు ప్రధాని మోదీ వస్తున్న సమయంలో ఈ పరిణామాలు బీజేపీకి షాక్‌నిచ్చాయి. కాగా, తనపై వచ్చిన ఆరోపణలను గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఖండించారు. ఇది దురుద్దేశంతో అల్లిన కట్టుకథ అని అన్నారు. 'ఒకవేళ ఎవరైనా ఎన్నికల్లో లబ్ధి పొందడానికి నాపై దుష్ప్రచారం చేయొచ్చు. అయితే బెంగాల్‌లో అవినీతి, హింసపై నా పోరాటాన్ని ఆపలేరు' అని ఆయన పేర్కొన్నారు.

## ఢిల్లీలో మళ్లీ ఎల్జీ వర్సెస్ ఆప్

- **మహిళా కమిషన్‌లో 52 మంది ఉద్యోగులను తొలగిస్తూ ఎల్జీ వీకే సక్సేనా నిర్ణయం**
- **ఆప్ ఎంపీ స్వాతి మలివాల్ ఆగ్రహం**




న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళా కమిషన్‌లో పని చేస్తున్న 52 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పంపిన ప్రతిపాదనలను ఆయన ఆమోదించారు. దీంతో అక్రమంగా నియమితులైన కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తున్నట్టు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కమిషన్‌లో 40 పోస్టులు మాత్రమే మంజూరైతే, 223 మందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించారని, నియామక ప్రక్రియ కూడా సరిగ్గా జరగలేదని ఉత్తర్వుల్లో అధికారులు పేర్కొన్నారు. అయితే, 52 మందిని నియమించారని, మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ 52 మందిని విధుల నుంచి తొలగించినట్టు గురువారం పేర్కొన్నారు.

**తుగ్లక్ నిర్ణయం: స్వాతి మలివాల్**

లెఫ్టినెంట్ గవర్నర్ నిర్ణయాన్ని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ స్వాతి మలివాల్ తప్పుపట్టారు. ఎల్జీ 'తుగ్లక్' ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపించారు. కాంట్రాక్టు సిబ్బందిని తొలగిస్తే మహిళా కమిషన్‌కు తాళాలు వేయాల్సి వస్తుందని ఆమె పేర్కొన్నారు. రక్తం, చెమట ధారబోసి మహిళా కమిషన్‌ను నిర్మించామని, దీనికి సిబ్బందిని, రక్షణను ఇవ్వాల్సింది పోయి పునాదుల నుంచి ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. తాను జీవించి ఉన్నన్ని రోజులు కమిషన్‌ను మూతపడనివ్వనన్నారు.

## జార్ఖండ్ కాంగ్రెస్ 'ఎక్స్' ఖాతా సస్పెండ్

రాంచీ, మే 2: అమిత్ షా నకిలీ వీడియో కేసుకు సంబంధించి వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నాయకులకు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీచేస్తున్నారు. తాజాగా జార్ఖండ్ కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' (ట్విటర్) ఖాతా సస్పెండ్ అయ్యింది. చట్టపరమైన చర్యల్లో భాగంగా జార్ఖండ్ కాంగ్రెస్ 'ఎక్స్' ఖాతాను సస్పెండ్ చేసినట్టు 'ఎక్స్' ఈ మేరకు తెలిపింది. వీడియోను షేర్ చేసిన వారిలో ఉన్నందున జార్ఖండ్ కాంగ్రెస్ చీఫ్ రాజేశ్ ఠాకూర్‌కు ఢిల్లీ పోలీసుల నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఆయనపై పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదుచేశారు.

## 2జీ తీర్పుపై కేంద్రం అభ్యర్థన తిరస్కరణ

న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులపై 2012లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును సవరించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అభ్యర్థనను అనుమతించేందుకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ తిరస్కరించింది. స్పష్టత ఇవ్వాలన్న ముసుగులో తీర్పును సమీక్షించాలని కేంద్రం ప్రయత్నిస్తున్నదని రిజిస్ట్రీ పేర్కొన్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. 2008 జనవరిలో ఏ రాజా టెలికం మంత్రిగా ఉన్న సమయంలో వివిధ సంస్థలకు కేటాయించిన స్పెక్ట్రమ్ లైసెన్సులను రద్దు చేస్తూ 2012లో సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. వేలం ద్వారా మాత్రమే స్పెక్ట్రమ్‌ను కేటాయించాలని కోర్టు తీర్పు చెప్పింది. అయితే ఈ తీర్పు సవరించాలని కేంద్రం కోరుతున్నది.

## 'ఇండియా కూటమి గెలిస్తే.. బీజేపీ ప్రభుత్వాలు కూలుతయ్'

*పానాజీ, మే 2: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. బీజేపీ నేతృత్వంలోని 10 నుంచి 15 రాష్ట్ర ప్రభుత్వాలు కుప్పకూలుతాయని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక 10వ షెడ్యూల్‌ను సవరించి ఫిరాయింపులను నివారిస్తామని, పార్టీ మారిన వారిని అనర్హులుగా చేస్తామని చెప్పారు. అలా చేయడం వల్ల పార్టీ మారిన వారు అనర్హులై, దొడ్డి దారిన అధికారం చేపట్టిన 10, 15 ప్రభుత్వాలు జూలై నాటికి పడిపోతాయన్నారు. కాగా, కర్ణాటకలోని సెక్స్ స్కాండల్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ పాస్‌పోర్టును రద్దు చేసి, అతడిని భారత్ రప్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని పవన్ ఖేరా అన్నారు.*





## 'బీజేపీకి 400 సీట్లా?.. అదో జోక్'

*న్యూఢిల్లీ, మే 2: ఈ లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు గెల్చుకుంటామని బీజేపీ చేస్తున్న ప్రచారాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ఎద్దేవా చేసింది. 'ఈ ఎన్నికల్లో 400 సీట్లు గెల్చుకుంటామనడం పెద్ద జోక్. ఆ పార్టీ 300 సీట్లు దాటడమే అసాధ్యం. 200 సీట్లు గెలవడం వారికి సవాల్' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో దిగువ సభలో కమలం పార్టీ తప్పక మెజారిటీని కోల్పోతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. గురువారం ఆయన పీటీఐతో మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో బీజేపీకి కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో వచ్చే సీట్లు సున్నా అని, దక్షిణాదిలో ఆ పార్టీ పరిస్థితి 2019 కన్నా అధ్వానంగా ఉందని అన్నారు. ఇక ఉత్తరాదిన సైతం గతంలోలా ఎన్డీఏ సీట్లు తెచ్చుకోవడం అసాధ్యమని అన్నారు.*

## రాయ్‌బరేలీ బీజేపీ అభ్యర్థిగా దినేష్ ప్రతాప్ సింగ్

**అభ్యర్థి పేరు ఇంకా ప్రకటించని కాంగ్రెస్**

న్యూఢిల్లీ, మే 2: కాంగ్రెస్‌కు కంచుకోట అయిన యూపీలోని రాయ్‌బరేలీలో బీజేపీ అభ్యర్థిగా దినేష్ ప్రతాప్ సింగ్ పేరును ఆ పార్టీ గురువారం ప్రకటించింది. కాగా, నామినేషన్ల తుది గడువుకు ఇంకా 24 గంటలే ఉన్నప్పటికీ ఇక్కడ పోటీ చేసే అభ్యర్థిని కాంగ్రెస్ ఇంతవరకూ ప్రకటించ లేదు. కాంగ్రెస్ మాజీ ఎంఎల్‌సీ అయిన దినేష్ ప్రతాప్ సింగ్ దేశ ప్రజలకు అంతగా తెలియక పోయినా యూపీ ప్రజలకు చిరపరిచితుడే. ఆయన 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై పోటీ చేసి ఓటమి చెందారు. అయితే ఈసారి అభ్యర్థి ఎవరైనా గెలుపు మాత్రం తనదేనంటూ దినేష్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమేథీలో అమలు చేసిన వ్యూహాన్నే రాయ్‌బరేలీలో కూడా అమలు చేయాలని బీజేపీ భావిస్తున్నది.